క్లుప్తంగా

దాసాంజనేయ స్వామి సేవలో ఎమ్మెల్యే విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వామివారి ఆశీస్సులు ప్రజలందరికీ అందాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. స్థానిక మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకల్లో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారిని భక్తితో సేవిస్తే సకల కష్టాలు తీరుతాయన్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండ, కోలా సూరాంబ, కె.నాగాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ సెక్షన్ అలంకార్ సబ్ స్టేషన్, 11 కె.వి. అలంకార్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ విజయవాడటౌన్ డివిజన్ ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్ రాజు రోడ్డు, పాపయ్య వీధి, జ్ఞానోలివ్ వారి వీధి, రైల్వే స్టేషన్ రోడ్డు, ఆంధ్ర రత్న రోడ్డు, రామారావు స్ట్రీట్, తాలూకా ఆఫీస్ ఏరియా, నర్రా వారి స్ట్రీట్, ప్రెస్ క్లబ్, అలంకార్ సినిమా హాల్, ఐలాపురం హోటల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు ప్రింటర్ బహూకరణ



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు కళాశాల అవసరాలను గుర్తించి ప్రింటర్ బహూకరించడం అభినందనీయమని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉపయోగించడానికి ప్రింటర్‌ను కొనుగోలు చేసి ప్రిన్సిపాల్ ఎం.విజయసారథికి శుక్రవారం అందజేశారు. సంఘం అధ్యక్షుడు ఎంవీ.బాబు, కార్యదర్శి గోపిచంద్, సభ్యుడు కిషోర్, కళాశాల ఎలక్ట్రికల్ విభాగాధిపతి బి.భీమా నాయక్, మెటాలజీ విభాగాధిపతి శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ అధ్యాపకుడు వి.భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వనాథ సత్యనారాయణ జయంతి



మధురానగర్(విజయవాడసెంట్రల్): విశ్వానికి లోకశ్రేయస్సే విశ్వనాథ రచనల పరమావధి అని కవులు, కళాకారులు మన సంస్కృతికి నిలువుటద్దాలు అని ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ జె.వి. మార్కండేయశర్మ అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో శుక్రవారం జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, కళాప్రపూర్ణ, పద్మభూషణ్, కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ 128వ జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

హాహా హూహూ, విష్ణుశర్మ ఇంగ్లిష్ చదువు వంటి రచనలలో విశ్వనాథ ప్రతిపాదించిన అంశాలను ఆసక్తికరంగా వివరించారు. చిన్నకథలతో విశ్వనాథను చదవడం ప్రారంభించాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ మాట్లాడుతూ సహృదయతతో కవుల సృజన రచనలను చదివినవారికి విజ్ఞానంతో పాటు ఉత్తమ సంస్కారం కూడా కలుగుతుందన్నారు. విశ్వనాథ వారు పనిచేసిన కళాశాల ప్రాంగణంలోనే తాము పనిచేయటం పూర్వజన్మ సుకృతంగా పేర్కొన్నారు.

కళాశాల అంతర్గత ప్రమాణాల భరోసా మండలి, తెలుగు విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా విశ్వనాథ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విశ్వనాథ పద్యాలను ఆలపించిన విద్యార్థులు మాధురిని, విశ్వనాథ గురించి ప్రసంగించిన వెంకాయమ్మను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బాలకృష్ణ, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

- కిటకిటలాడిన దేవాలయాలు
- సామూహిక కుంకుమార్చనలు



విజయదుర్గానగర్‌లో సామూహిక కుంకుమ పూజులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన శ్రావణ మాసం, శుక్రవారం కావటంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠం, మధురానగర్ నేతాజీ కాలనీలోని శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠం, దావు బుచ్చయ్యకాలనీ శ్రీ శ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయం, విజయదుర్గానగర్‌లోని శ్రీ విజయ దుర్గా సమేత విజయేశ్వర లక్ష్మీ, వెంకటేశ్వరస్వామివారి దేవాలయం, ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవాయంలో ఆలయ కమిటీల ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



అంకమ్మతలి



శ్రీ శ్యామలాంబదేవి అమ్మవారు



విజయేశ్వర లక్ష్మీదేవి అమ్మవారు

సామూహిక కుంకుమార్చనలు..

విజయదుర్గానగర్‌లోని శ్రీ విజయ దుర్గా సమేత విజయేశ్వర లక్ష్మీ, వెంకటేశ్వరస్వామివారి దేవాలయంలో సమర సేత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యాన శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు పి.ప్రేమకుమార్ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే భక్తులచేత సంప్రదాయబద్ధంగా సామూహిక కుంకుమార్చనలు చేయించారు. సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు ఉప్పులూరి శేషప్రసాద్ శర్మ మాట్లాడుతూ భక్తులందరికీ అమ్మవారి ఆశీస్సులు అందాలనే సదుద్దేశంతో తాము సామూహిక కుంకుమార్చనలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో నగర మేయర్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం ఆలయ ఈవో భ్రమరాంబ అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

ఆర్ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణం చేపట్టాలి

- రైల్వే జీఎంతో సికింద్రాబాద్‌లో ఎమ్మెల్యే విష్ణు భేటీ
- నియోజకవర్గంలో రైల్వే అభివృద్ధి పనులపై సమీక్ష



రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): సెంట్రల్ నియోజకవర్గంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్ఓబీ), రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ)ల నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కోరారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌తో శుక్రవారం సికింద్రాబాద్‌లోని రైల్‌నిలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో రైల్వే అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. నగరంలో నెలకొన్న రైల్వే సమస్యలపై ఇప్పటికే రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఈ సందర్భంగా విష్ణు గుర్తు చేశారు. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో సెంట్రల్ నియోజకవర్గ ప్రాంతంలోని రైల్వే సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని జీఎంను కోరారు.

పెండింగ్‌లో ఉన్న అనుమతులు క్లియర్ చేయాలి

విజయవాడ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా పలు చోట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రైల్వే అండర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జీఎం దృష్టికి తీసుకువెళ్లారు. ప్రతి రోజు 70 నుంచి 80 సార్లు గేటు పడుతుండటంతో ఆయా ప్రాంతాల విద్యార్థులు, ఉద్యోగులు, రోజు వారి కూలీలు, పేషెంట్లు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. నియోజకవర్గ ప్రజల అవసరాల దృష్ట్యా గుణదలలో కిమీ 434/20–22 వద్ద ఒకటి, గుణదల కిమీ 5/6–7 వద్ద మరొకటి, మధురానగర్ పప్పుల మిల్లు వద్ద, రాజరాజేశ్వరి పేటలలోని రైల్వే గేట్ల వద్ద గతి శక్తి ప్రాజెక్టు కింద రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్ఓబి) నిర్మాణాలను చేపట్టాలన్నారు. వాంబేకాలనీలో రైల్వే ట్రాక్ వద్ద గేటు లేకపోయినప్పటికీ ఆ ప్రాంత ప్రజల అవసరాలను గుర్తించి ప్రత్యేక చొరవతో ఆర్ఓబీ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు.

అలాగే అజిత్ సింగ్‌నగర్–రామకృష్ణాపురం ఆర్‌యూబీ వద్ద ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా అదనంగా మరో బాక్స్ మార్గానికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. మరోవైపు శ్రీనగర్ కాలనీ రైల్వే గేట్లు మూసివేయటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు జీఎం దృష్టికి తీసుకువెళ్లారు. వీఎంసీ అధికారుల సమన్వయంతో సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. రామకృష్ణాపురం–దేవీనగర్ రైల్వే అండర్ పాస్ వద్ద జరగవలసిన రహదారి నిర్మాణం, యూజీడీ, వాటర్ లైన్ పనులకు రైల్వే పర్మిషన్లు లేకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. జీవీఆర్ నగర్‌లో కొత్తగా వేసిన యూజీడీ లైన్లను అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎస్టీపీ(సూయజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)కి అనుసంధానించేందుకు వీలుగా పెండింగ్‌లో ఉన్న రైల్వే అనుమతులను క్లియర్ చేయాలని విన్నవించారు. బసవతారక నగర్, రామకృష్ణాపురం రైల్వే ట్రాక్ వెంబడి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచడానికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే విష్ణు తెలిపారు. ఈ సమీక్షలో నగరపాలకసంస్థ ఈఈ(ఇంజినీరింగ్) శ్రీనివాస్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర ఓటర్ల సర్వే పక్కాగా చేపట్టాలి



బీఎల్ఓ, బీఎల్ఏల సమావేశంలో మాట్లాడుతున్న ఏఈఆర్వో ప్రసాద్

పాయకాపురం(విజయవాడరూరల్): ఇంటింటికీ సమగ్ర ఓటర్ల సర్వే కార్యక్రమం నూటికి నూరు శాతం పక్కాగా చేపట్టాలని చీఫ్ సిటీ ప్లానర్, ఏఈఆర్వో జీవీవీ ప్రసాద్ ఆదేశించారు. 61వ డివిజన్ హెచ్ బ్లాక్‌లో 61, 62, 63, 64 డివిజన్లలోని బూత్‌స్థాయి ఏజెంట్లు, బూత్‌స్థాయి అధికారుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఏఈఆర్వో ప్రసాద్ మాట్లాడుతూ.. సర్వే పూర్తయిన వాటిలో తప్పులున్నాయన్నారు. రాజకీయ పార్టీల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఇంటింటికీ సమగ్ర సర్వేను రెండు దఫాలుగా చేయాలని చెప్పారు. ఓటర్ల జాబితా సమర్థవంతంగా ఉండాలన్నారు. ఒకే ఓటరు పేరు రెండు చోట్ల ఉండరాదని, ఈ విషయంలో రాజకీయపార్టీల ఏజెంట్ల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో సర్వే సక్రమంగా చేయాలన్నారు. అక్టోబర్ 17వ తేదీ నాటికి ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని, డబుల్ ఓట్లను తొలగించడంతో పాటు కొత్త ఓట్లను నమోదు చేయాలని చెప్పారు. సమావేశంలో బీఎల్ఓలు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

18 నుంచి వినాయక చవితి ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులోని వినాయకుని గుడిలో ఈ నెల 18వ తేదీ నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు గణపతి యూత్ ఆధ్వర్యాన వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మందిర వ్యవస్థాపకుడు రంకిరెడ్డి సూర్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా గత 36 సంవత్సరాలుగా వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రోజు ప్రత్యేక పూజలు, విశేష అర్చనలు జరుగుతాయని చెప్పారు. వచ్చే నెల ఒకటో తేదీ మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం స్వామివారి ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులు వినాయక చవితి ఉత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

వీహెచ్‌పీ నిరసన ర్యాలీ



సత్యనారాయణపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న వీహెచ్‌పీ నేతలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): హిందూ ధర్మాన్ని కించపరుస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) నేతలు శుక్రవారం సత్యనారాయణపురం ర్యాలీ నిర్వహించారు. ఉదయనిధి అనుచిత వ్యాఖ్యలపై సుప్రీం కోర్టు సుమోటాగా కేసు స్వీకరించి కఠినంగా శిక్షించాలని నేతలు డిమాండ్ చేశారు. స్టాలిన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సత్యనారాయణపురం నుంచి శివాజీకేఫ్, బీఆర్టీఎస్ రోడ్డు, శారద కళాశాల జంక్షన్, పుడ్‌జంక్షన్ మీదుగా ర్యాలీ చేపట్టారు.

పారిశుద్ధ్యం నిర్వహణను మరింత మెరుగుపర్చాలి



కార్మికులకు సూచనలిస్తున్న కార్పొరేటర్ షాహీనా సుల్తానా, అధికారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): డివిజన్‌లో పారిశుద్ధ్యం నిర్వహణను మరింత మెరుగుపర్చాల్సిన బాధ్యత కార్మికులందరిపై ఉందని 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా అన్నారు. ఆ డివిజన్‌లోని శానిటరీ అధికారులు, సిబ్బందితో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశుభ్రత విషయంలో సిబ్బంది కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇటువంటి వారు తమ ప్రవర్తనను మార్చుకోవాలని సూచించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎక్కువ ఫిర్యాదులు శానిటరీవే వస్తున్నాయని, డివిజన్‌లో పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రజారోగ్య శాఖ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. డివిజన్‌ను స్వచ్ఛ డివిజన్‌గా తీర్చిదిద్దుదామన్నారు. ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, శానిటరీ ఇనస్పెక్టర్ వందనం బాబు, వార్డు సచివాలయాల శానిటరీ సెక్రటరీలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

దేశ సేవలో పాల్గొనటం సంతోషంగా ఉంది

- ఇస్రో ఉపగ్రహాలకు విడిభాగాలు అందించటం నా అదృష్టం
- కేబీఎన్ కళాశాల పూర్వ విద్యార్థి నాగభూషణరెడ్డి



నాగభూషణరెడ్డిని సత్కరిస్తున్న కళాశాల పాలకవర్గం, పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశం రోదసిలోకి పంపించే శాటిలైట్లలో వినియోగించే విడిభాగాలను అందించటం తద్వారా దేశానికి సేవలో పాల్గొనటం ఎంతో సంతోషాన్నిస్తోందని నాగసాయి ప్రెసెషియస్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత, కేబీఎన్ కళాశాల పూర్వ విద్యార్థి బి.నాగభూషణరెడ్డి అన్నారు. ఇస్రో రోదసిలోకి పంపించే ఉపగ్రహాల్లో బ్యాటరీకు రక్షణ కవచాలకు సంబంధించిన విడిభాగాలను తయారు చేసే నాగభూషణరెడ్డి విజయవాడ కేబీఎన్ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యను అభ్యసించారు. ఈ సందర్భంగా ఆ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం జరిగిన అభినందన కార్యక్రమంలో సంఘ నాయకులు, కళాశాల పాలకవర్గం నాగభూషణరెడ్డిని ఘనంగా సత్కరించారు.

గత సేవలతో అవకాశమిచ్చారు..

ఈ సందర్భంగా నాగభూషణరెడ్డి మాట్లాడుతూ ఇస్రో పంపించే ఉపగ్రహాలకు సంబంధించి బ్యాటరీ వ్యవస్థకు కవచాలను తమ సంస్థ ద్వారా అందిస్తున్నామన్నారు. తాను విజయవాడ గాంధీనగర్‌లోని హిందూ హైస్కూల్‌లో హైస్కూల్ విద్యను, కేబీఎన్ కళాశాలలో ఇంటర్మీడియెట్‌ను అభ్యసించానని, ఆ తరువాత ఇంజినీరింగ్ చేశానన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే టూల్ డిజైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో పీజీ చేశానని చెప్పారు. ఆ తరువాత తాను పని చేసిన కొన్ని రక్షణ వ్యవస్థ సంస్థల్లో పొందిన అనుభవంతో ఉపగ్రహాలకు అవసరమయ్యే కొన్ని భాగాలను తయారు చేస్తున్నానన్నారు. గత సేవలతో ఇస్రో తనకు అవకాశాన్ని కల్పించిందని చెప్పారు. హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్షుడు చిట్టూరి ఆనందరామసుధాకర్ మాట్లాడుతూ.. 1907లో కేవలం ఐదుగురు విద్యార్థులతో ప్రారంభమైన తమ విద్యా సంస్థ నేడు వేలాది మంది విద్యార్థులతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. కళాశాల అధ్యక్ష కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ తమ కళాశాల పూర్వ విద్యార్థులు వివిధ రంగాల్లో అద్భుతమైన ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తున్నారన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు డీపీ రామకృష్ణ, జుల్లూరి శ్రీనివాసులు మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో రానున్న కాలంలో మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హిందూ హైస్కూల్స్ కమిటీ కోశాధికారి గోళ్ల బాబావిజయకుమార్, కళాశాల కోశాధికారి అన్నం రామకృష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు పాల్గొన్నారు.

ఆస్టర్ రమేష్‌లో వంద 'పోయెమ్' చికిత్సలు



మాట్లాడుతున్న డాక్టర్ బత్తిన రాజేష్, డాక్టర్ సౌజన్య

లబ్బీపేట(విజయవాడ తూర్పు): ఆహార నాళం మూసుకుపోయి, ఆహారం మింగుడు పడక ఇబ్బందులు పడుతున్న 100 మందికి అత్యాధునిక పర్ ఓరల్ ఎండోస్కోపిక్ మయాటమీ(పోయెమ్) చికిత్సలు నిర్వహించినట్లు ఆస్టర్ రమేష్ హాస్పిటల్ సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బత్తిన రాజేష్ చెప్పారు. రాష్ట్రంలోనే అత్యధిక మందికి ఈ శస్త్రచికిత్సలు తాము నిర్వహించామన్నారు. హాస్పిటల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ ఆహార నాళం మూసుకుపోయి మింగుడు పడకుండా ఉండటాన్ని అఖలేసియా కార్డియాగా పేర్కొంటామన్నారు. అఖలేసియా కార్డియా అనే వ్యాధిలో ఆహారనాళం నుంచి పొట్టలోనికి వెళ్లకుండా కండరాలు అడ్డుపడతాయని, దీంతో ఆహారం ఆహార నాళిక వద్దేనే అడ్డుపడిపోతుందన్నారు. చికిత్స చేయని పక్షంలో మింగడమే అసాధ్యమవుతుందని, ఏమి తిన్న గుండెలో మంట, ఛాతీనొప్పి, దగ్గు, ఆయాసం, ఆహారం ఊపిరితిత్తుల్లోకి చేరడం, బరువు తగ్గడం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ వ్యాధి ఏ వయస్సువారికైనా రావచ్చునన్నారు. సమావేశంలో గ్రూపు క్వాలిటీ హెడ్ డాక్టర్ సౌజన్య, ఎనస్థీషియా డాక్టర్ చెరుకూరి పద్మజ పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు



గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకల్లో ఉపాధ్యాయులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో శుక్రవారం రాత్రి గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థుల అమ్మమ్మలు, నానమ్మలు, తాతయ్యలు పాల్గొన్నారు. ఈ సంద్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి చూపరులను ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులు వారి వారి గ్రాండ్ పేరెంట్స్‌ను సత్కరించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజన్, చైర్మన్ మోనికా పాల్గొని గ్రాండ్ పేరెంట్స్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీకౌసల్య, వైస్ ప్రిన్సిపాల్ రమ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం



అంగన్‌వాడీ చిన్నారులతో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అక్షరాస్యతతోనే అభివద్ధి సాధ్యమని అక్షరాస్యత పెంపొందించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బి.వసంతకుమార్ అన్నారు. స్థానిక 27వ డివిజన్ గులాబీతోట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా చిన్నారులకు పలకలు, స్లేట్ పెన్సిల్స్, పెన్సిల్స్, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరాస్యత ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద పిల్లలకు వారి తల్లిదండ్రులకు తెలియచేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పక చదువు చెప్పించాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, ఉపాధ్యక్షులు ఎం.రాము, కె.వరప్రసాద్, నాగ మల్లిక, షఫీ, విశ్వేశ్వరయ్య, పార్వతి, మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలి



తోపుడు బండి అందజేస్తున్న దాతలు


చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యుడు జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సంపర తాతాబ్బాయ్ ట్రస్ట్, ఏబీసీడీ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం తోపుడు బండ్లు పంపిణీ చేశారు. నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని అర్జునవీధిలో నిర్వహించిన కార్యక్రమానికి శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది సంపర శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రజలకు, సమాజానికి మేలు కలిగించే కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ నిర్వహించాలని సూచించారు. నేత్రదానంపై అవగాహన కల్పించడంతో చూపు లేని వారి ఎందరికో చూపును ప్రసాదించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏబీసీడీ ట్రస్ట్ చైర్మన్ ఆవులు వెంకట్రావు, న్యాయవాది ఎస్.కోటబాబు పాల్గొన్నారు.

డయల్ యువర్ సీపీకి 12 ఫిర్యాదులు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రజా సమస్యల సత్వర పరిష్కార వేదికగా శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ పోలీస్ కమిషనర్ కార్యక్రమంలో 12 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమీషనర్ టికె రాణా నేరుగా బాధితులతో మాట్లాడి ఫిర్యాదులు నమోదు చేసుకున్నారు. అందులో ట్రాఫిక్ సమస్యలు, అసాంఘిక శక్తులు, కుటుంబ గొడవలు, ఆర్థిక నేరాలు, స్థలం తగాదాలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. దీనిపై పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్ఓలు, ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించే దిశగా ఆదేశాలు జారీ చేశారు.

ఎన్ఆర్ఐ వివాహాలపై అవగాహన సదస్సు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సీఐడీ ఎన్ఆర్ఐ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని స్టెల్లా కాలేజీ ఆడిటోరియంలో ఎన్ఆర్ఐ వివాహ సమస్యలు, భారతీయ మహిళల హక్కులపై సామాజిక–చట్టపరమైన సాధికారత అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎం.బబిత పాల్గొని మహిళల హక్కులు, తమను తాము రక్షించుకోవడానికి సాధికారత కల్పించడం లక్ష్యంగా భారతీయ చట్టం ప్రకారం మహిళలకు అందుబాటులో ఉన్న ముఖ్యమైన చట్టపరమైన హక్కులు, నిబంధనలను తెలియజేశారు. ఎన్ఆర్ఐ సంబంధాల కోసం ప్రయత్నించేముందు వారి పాస్‌పోర్ట్, వీసా, ఐటీ రిటర్న్స్ నేర చరిత్ర, మునుపటి వివాహ పరిస్థితులను తెలుసుకోకుండా వివాహ సంబంధాలు చేసుకోకూడదని సూచించారు. ఓవర్సీస్ ఇండియన్ మ్యారేజెస్ – సేఫ్టీ గైడెలైన్స్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఏపీఎన్ఆర్‌టీ ప్రెసిడెంట్ మేడపాటి వెంకట్, రీజనల్ పాస్పోర్ట్ ఆఫీసర్ కె.శివహర్ష, సీఐడీ లీగల్ అడ్వైజర్ ఎం.లక్ష్మణ్‌రావు, సీఐడీ ఎన్ఆర్ఐ సెల్ ఎస్పీ కేజీవీ సరిత, పలు జిల్లాల మహిళా పోలీసులు పాల్గొన్నారు.